క్లుప్తంగా

చందన అలంకరణలో శ్రీనివాసుడు



ప్రత్యేక అలంకరణలో స్వామి

ఉక్కునగరం: శ్రీనివాసుడు చందన శోభితుడై దర్శనమిచ్చారు. సోమవారం స్థానిక సెక్టార్–1 వేంకటేశ్వర స్వామి దేవాలయంలో స్వామిని చందనంతో అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. ధనుర్మాస ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భాగంగా ఆలయ ప్రధానార్చకులు భావనారాయణ స్వామి, అర్చకులు హరినారాయణ వేకువజామున శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు. అంతకు ముందు సుప్రభాత సేవ, ఆరాధన, తిరుప్పావై సేవా కాలం, గోదాదేవి అర్చన, మంగళాశాసనం, పాశుర విన్నపం చేశారు. అనంతరం పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

చిన్నారుల చదువుకు చేయూత



సొసైటీ నిర్వాహకులకు చెక్కు అందజేస్తున్న సుధీర్‌రెడ్డి తదితరులు

గాజువాక: స్థానిక డిజైర్ సొసైటీలో ఆశ్రయం పొందుతున్న ముగ్గురు చిన్నారుల చదువు కోసం తుంగ్లాం గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు గొందేశి సుధీర్‌రెడ్డి రూ.75వేల ఆర్థిక సహాయం అందజేశారు. రవీంద్ర ఇండియన్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎస్‌వీకే పరశురామ్‌తో కలిసి ఈ మొత్తానికి చెందిన చెక్కును డిజైర్ సొసైటీ నిర్వాహకులు పి.లక్ష్మణ, ఎస్.రజనీలకు అందించారు. తన తండ్రి రామ్‌రెడ్డి జ్ఞాపకార్థం తాను ఈ సహకారం అందజేసినట్టు సుధీర్‌రెడ్డి తెలిపారు.

కోలాట బృందానికి చీరల పంపిణీ



కోలాట బృందం సభ్యులకు చీరలు అందిస్తున్న పూర్ణ

అగనంపూడి: హిందూ సంప్రదాయానికి కోలాటం నిలువుటద్దమని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ జి.పూర్ణానందశర్మ (పూర్ణ) అన్నారు. మన సంస్కృతీ, సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జీవీఎంసీ 85వ వార్డు దానబోయినపాలెం సీతారామాంజనేయ మహిళా కోలాట బృందానికి పూర్ణ సౌజన్యంతో చీరలు అందించారు. దానబోయినపాలెం రామాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రసన్న యూత్ నాయకులు పాల్గొన్నారు.

కొత్త సీజీఎంకు అభినందన



నూతన సీజీఎం సోఫ్టీకి అభినందనలు తెలుపుతున్న సిటూ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ వర్క్స్ విభాగం నూతన సీజీఎం ఎ.కె. సోఫ్టీకి స్టీల్ సీఐటీయూ నాయకులు అభినందనలు తెలిపారు. సీజీఎం వర్క్స్‌గా విధులు నిర్వహించిన ఎస్.వి.స్వామి ఆదివారం పదవీ విరమణ చేయడంతో, ఆయన స్థానంలో సోఫ్టీ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు అయోధ్యరామ్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, అధ్యక్షుడు వై.టి.దాస్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు చేరువలో ‘ప్లస్ టు’

నాడు నియోజకవర్గానికి గుండెకాయ వంటి గాజువాక పట్టణంలో ఒక్క ప్రభుత్వ కళాశాల కూడా లేదు. కనీసం జూనియర్ కళాశాలైనా ఏర్పాటు చేయాలని ఇక్కడి ప్రజలు రెండు దశాబ్దాలుగా కోరుతూ వచ్చారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ప్రాంతం కావడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు ఇక్కడికి వలస వస్తున్నారు. వారి పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించడం కోసం ప్రభుత్వ కళాశాలలు లేకపోవడంతో ప్రైవేట్ కళాశాలలను ఆశ్రయించాల్సిన పరిస్థితి. ఆర్థికంగా ఇబ్బందులున్నవారు అటు అగనంపూడిలోని జూనియర్ కళాశాలకో, నగరంలోని ప్రభుత్వ కాలేజీలకో వెళ్లాల్సి వచ్చేది. ఈ పరిస్థితుల్లో గాజువాక హైస్కూల్‌ను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని పదిహేనేళ్ల క్రితం చేసిన ప్రతిపాదనలు బుట్టదాఖలయ్యాయి.

నేడు పేదల కష్టాలు విన్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి గాజువాక పట్టణంలో ఇంటర్మీడియట్ విద్యను అందుబాటులోకి తెచ్చారు. గాజువాక పట్టణ నడిబొడ్డులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ప్లస్ టు స్కూల్‌గా అప్‌గ్రేడ్ చేశారు. ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లను అందుబాటులో తెచ్చారు. ప్రస్తుతం బాలికలకు ఇందులో అడ్మిషన్లు ఇస్తున్నారు. గాజువాకలోని వివిధ ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థినులు ఇక్కడ ఇంటర్మీడియట్ చదువుతున్నారు.



క్లాస్‌లో పాఠాలు శ్రద్ధగా వింటున్న ఇంటర్ విద్యార్థినులు

- జూనియర్ కాలేజీగా గాజువాక హైస్కూల్ అప్‌గ్రేడేషన్
- బాలికలకు తగ్గిన దూరాభారం
- తల్లిదండ్రుల హర్షం

ఇది కదా అభివృద్ధి

గాజువాక: గాజువాక జెడ్పీ హైస్కూల్‌ను జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 2022–23 విద్యాసంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ ప్రారంభించారు. ప్రస్తుతం ఈ స్కూల్‌లో ఇంటర్మీడియట్ కోర్సుల్లో నాలుగు సెక్షన్లు నిర్వహిస్తున్నారు. ఎంపీసీ, బైపీసీలలో ఒక్కో కోర్సుకు రెండు సెక్షన్లు ఏర్పాటు చేశారు. ఈ తరగతుల కోసం రెండు భవనాలను కేటాయించారు. మరో **భవనం నిర్మాణంలో ఉంది.** బోధన కోసం ప్రతీ తరగతిలో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ (డిజిటల్ బోర్డు) ఉపయోగిస్తున్నారు. ప్రస్తుతం అన్ని తరగతుల్లో 104 మంది విద్యార్థులు చదువుతున్నారు. అన్ని సబ్జెక్టులకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో అధ్యాపకులను నియమించడంతో బోధనపై విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



డిజిటల్ బోర్డుపై బోధిస్తున్న అధ్యాపకుడు



గాజువాక హైస్కూల్‌లో ప్లస్ టు బ్లాక్



అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన



ప్లస్ టు క్లాస్‌లకు ప్రభుత్వం పూర్తిస్థాయిలో అధ్యాపకులను నియమించింది. వారంతా చాలా అనుభవజ్ఞులు. ప్రతీరోజు క్లాసులతో పాటు ఎక్స్‌ట్రా క్లాసులను కూడా నిర్వహిస్తారు. ఈ హైస్కూల్‌లో ఇంటర్మీడియట్ నడుస్తోందని ఇప్పుడిప్పుడే అందరికీ తెలుస్తోంది. వచ్చే ఏడాది అడ్మిషన్లు ఇంకా పెరుగుతాయని భావిస్తున్నాం. –కె.విజయ ప్రశాంతి, ప్రధానోపాధ్యాయిని, ప్లస్ టు ఇన్‌చార్జి

దూరం వెళ్లే భారం తప్పింది



కరోనా తరువాత మా కుటుంబం ఆర్థికంగా బాగా దెబ్బ తింది. అప్పట్నుంచి నేను ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నాను. ఇంటర్‌కు ఎక్కడికి వెళ్లాలో అని ఆందోళన చెందాం. కానీ మా స్కూల్లోనే ఏర్పాటు చేయడంతో దూరాభారం తప్పింది. మాకు అన్ని సబ్జెక్టులకు అధ్యాపకులున్నారు. చాలా బాగా బోధన సాగుతోంది. సబ్జెక్టులలో ఏ సందేహం వచ్చినా వెంటనే నివృత్తి చేస్తున్నారు. – ఇస్మాయిన్నా, ఇంటర్ ఫస్టియర్ బైపీసీ విద్యార్థి

డాక్టర్ కావాలని ఆకాంక్ష



మా తల్లిదండ్రులు చాన్నాళ్ల క్రితం మరణించారు. అప్పట్నుంచీ నానమ్మ వద్ద ఉండి చదువుకుంటున్నాను. హైస్కూల్‌లో ఇంటర్మీడియట్ ప్రవేశపెట్టడంతో ఇక్కడ చేరాను. లెక్చరర్స్ బాగా చెబుతున్నారు. డాక్టర్ కావాలనే లక్ష్యంతో చదువుతున్నాను. సబ్జెక్టులలో ప్రావీణ్యం ఎలా సాధించాలో అధ్యాపకులు ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తున్నారు. – ఎస్.మౌనిక, ఇంటర్ సెకండియర్ బైపీసీ విద్యార్థిని

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలని..



మా నాన్నగారు లేరు. అమ్మ చిన్న టిఫిన్ సెంటర్ నడుపుతూ నన్ను చదివిస్తోంది. ఆర్థికంగా చాలా ఇబ్బందులున్నాయి. బాగా చదువుకుని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవ్వాలని నిర్ణయించుకున్నాను. అధ్యాపకుల సహాయంతో నా లక్ష్యాన్ని చేరుకుంటాననే నమ్మకంతో చదువుతున్నాను. – కె.విజయ గాయత్రి దుర్గ, ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ విద్యార్థిని

ఫ్యాకల్టీ చాలా బాగుంది



మాది పేద కుటుంబం. నాన్న చిన్న కాంట్రాక్టర్. ఇప్పటివరకు ఓ ప్రైవేట్ మిషనరీ స్కూల్‌లో చదివాను. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇంటర్‌లో ఇక్కడ చేరాను. నాకు ఆర్కిటెక్ట్ అవ్వాలనే కోరిక. మా అధ్యాపకుల సహకారంతో కష్టపడి చదువుతున్నాను. మంచి ఫ్యాకల్టీ. పాఠ్యాంశాలన్నీ సందేహాలు రాని విధంగా, వివరంగా బోధిస్తున్నారు. – టి.వైష్ణవి, ఇంటర్ సెకండియర్ ఎంపీసీ విద్యార్థిని

కోటి ఆశలతో స్వాగతం

- అంతటా కొత్త సంవత్సరం జోష్
- మిత్రులు, బంధువులకు శుభాకాంక్షలు



స్టీల్‌ప్లాంట్ వేడుకల్లో యూనియన్ల నాయకులను సత్కరిస్తున్న కార్మికులు

గాజువాక: నూతన సంవత్సరానికి గాజువాక ఘన స్వాగతం పలికింది. 2023లో జ్ఞాపకాలను హృదయాంతరాల్లో నిక్షిప్తం చేసుకొని ఘనంగా వీడ్కోలు పలికింది. కోటి ఆశలతో కొత్త సంవత్సరాన్ని స్వాగతించింది. ఈ సందర్భంగా సంబరాలు అంబరాన్ని తాకాయి. పలు స్వచ్ఛంద సంస్థలు, సంఘాలు, కాలనీ అసోసియేషన్లు కేక్‌లు కట్ చేసి సంబరాలు నిర్వహించారు. వివిధ కాలనీలు, అపార్ట్‌మెంట్లు, నివాస ప్రాంతాల్లో ఆనందోత్సాహాలతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. యువకులు ద్విచక్రవాహనాలతో రోడ్లపై కేరింతలు కొడుతూ సందడి చేశారు. హోటళ్లలో వేడుకలను నేత్రపర్వంగా నిర్వహించారు. డీజే సౌండ్స్‌తో కూడిన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో హుషారెత్తించారు. చర్చిలు, దేవాలయాలు, ప్రార్థనా మందిరాల్లో ఆదివారం అర్ధరాత్రి వరకు ప్రత్యేక ప్రార్థనలు, పూజలు చేశారు. శ్రేయోభిలాషులకు, మిత్రులకు, కుటుంబ సభ్యులకు వినూత్న బహుమతులతో పాటు క్యాలెండర్లు, డైరీలను అందజేసి సంతోషాన్ని పంచుకున్నారు. ఈ వేడుకల్లో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కళకళలాడిన కార్యాలయాలు

నూతన సంవత్సరం సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలతో పాటు రాజకీయ పార్టీల కార్యాలయాలు కూడా కళకళలాడాయి. కార్యకర్తలు తమ అభిమాన నేతలను కలిసి పండ్లు, పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తిరెడ్డి, చింతలపూడి వెంకట్రామయ్య, పల్లా శ్రీనివాసరావు తదితరులను ఆయా పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి పుష్పగుచ్ఛాలు, పండ్లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ విభాగాలు, శాఖల అధికారులతో పాటు కార్పొరేటర్లు, పార్టీల వార్డు అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్లు, మాజీ కార్పొరేటర్లు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌లో..



ఉరుకూటి చందుకు శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పొరేటర్లు కేబుల్ మూర్తి, రాజాన రామారావు

ఉక్కునగరం: స్టీల్ ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో యూనియన్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన వేడుకల్లో యూనియన్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ కేక్ కట్ చేసి కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ, సిటు గౌరవాధ్యక్షులు జె. అయోధ్యరామ్ ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి రాజశేఖర్, నీరుకొండ రామచంద్రరావు, డి.ఆదినారాయణ, అయోధ్యరామ్‌లను కార్మికులు సత్కరించారు. కార్యక్రమంలో కె.ఎస్.ఎన్. రావు, యు.రామస్వామి, ఎస్.రామారావు, బీఎస్ రాజు, జి.వి.సుబ్బయ్య, బీఎంఆ నాయక్, గంగవరం గోపి, బి.టి.జగదీష్, కొమ్ము ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్లో..

పెదగంట్యాడ: స్థానిక బీసీ రోడ్డులోని టీఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్ వద్ద నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే నాగిరెడ్డి కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. నియోజకవర్గంలో నాయకులు, అభిమానులు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- 74వ వార్డులో కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి కేక్ కట్ చేశారు. అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.
- వైఎస్సార్ సీపీ పెదగంట్యాడ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి కేక్ కట్ చేశారు. అన్ని వార్డుల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి దేవన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.
- నడుపూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొడ్డు కృష్ణారావు, కార్యదర్శి కులుకూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నడుపూరులో నిర్వహించిన వేడుకల్లో కేక్ కట్ చేశారు. కులుకూరి మంగరాజు, బెల్లాల వెంకటరావు, వంకతాటి నరసింహమూర్తి, బచ్చు సోమరాజు, బెల్లాల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.
- 65వ వార్డులో కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు.
- అహింస పిరమిడ్ ధ్యాన కేంద్రంలో ప్రతినిధి మీసాల శివ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. గాజువాక వర్తక సంఘం గౌరవ అధ్యక్షుడు తిప్పల నితిష్‌రెడ్డి, వనిత, నీలకంఠం, దేవిక తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నాగిరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న చందు తదితరులు



కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఏఎంహెచ్‌వో కిరణ్‌కుమార్



నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న నడుపూరు ఆర్యవైశ్య సంఘం సభ్యులు



అక్కిరెడ్డిపాలెంలో నూతన సంవత్సరం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న చిన్నారులు

రంగవల్లికలతో..

అక్కిరెడ్డిపాలెం: రంగుల రంగవల్లికలతో నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. అర్ధరాత్రి 12 గంటలకు యువత, చిన్నారులు బాణసంచాతో హోరెత్తించారు. కేక్ కట్ చేసి ఉత్సాహంగా నూతన సంవత్సరాన్ని స్వాగతించారు. 68వ వార్డు కార్పొరేటర్ గుడివాడ అనూష, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్, 69వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు, కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి వేడుకలు నిర్వహించారు.

అగనంపూడి: 88వ వార్డు వెదుళ్లనరవ కొత్తూరు కాలనీలోని క్రైస్ట్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నిరుపేద క్రైస్తవులు వంద మందికి చర్చి నిర్వాహకుడు శామ్యూల్, దిలీప్ చీరలు పంపిణీ చేశారు.

- 85వ వార్డు అగనంపూడి బ్రహ్మకుమారీస్ సంస్థ దివ్యజ్యోతి భవనంలో నిర్వహించిన వేడుకల్లో టీఎస్‌ఆర్ టీటీకే విద్యాసంస్థల అధినేత బలరామకృష్ణ పాల్గొని కేక్ కట్ చేశారు. గండివానిపాలెం శ్రీ నూకాంబికా మహిళా కోలాట బృందం కోలాట ప్రదర్శన చేసింది, బ్రహ్మకుమారీస్ జిల్లా కో–ఆర్డినేటర్ రాజయోగి బీకే సోమేశ్వరి, అగనంపూడి ఇన్‌చార్జ్ బీకే రామకోటి తదితరులు పాల్గొన్నారు.



నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తూ తీర్చిదిద్దిన రంగవల్లిక



వెదుళ్లనరవ కొత్తూరులోని క్రైస్ట్ చర్చిలో చీరలు పంపిణీ చేస్తున్న పాస్టర్ శామ్యూల్



అగనంపూడి ఓంశాంతి భవన్‌లో వేడుకలు

జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు ఎంపిక

గాజువాక: ఈ నెల 3 నుంచి 6 వరకు ఢిల్లీలో నిర్వహించనున్న జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు గాజువాక ప్రాంతానికి చెందిన 20 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ పోటీల్లో పాల్గొనేందుకు వారు సోమవారం బయల్దేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారిని రాష్ట్ర కిక్ బాక్సింగ్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కరణంరెడ్డి నర్సింగరావు అభినందించారు. ఈ పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి 150 మంది క్రీడాకారులు హాజరు కానున్నారని, వారిలో 20 మంది గాజువాకకు చెందినవారు ఉండటం అభినందనీయమని పేర్కొన్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గంటా నూకరాజు, ప్రతినిధులు ప్రేమ్ కుమార్, వెంకట్, ఆనంద్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

శ్రీవారి ఆలయంలో పుష్పయాగం



పుష్పరాశి నడుమ శ్రీనివాసుడు



శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామిగా నాట్యకళాకారులు

పెదగంట్యాడ: వినాయకనగర్ వుడా కాలనీ మామిడి తోటలో కొలువుదీరిన పద్మావతి ఆండాళ్ సమేత ప్రసన్న వేంకటేస్వార స్వామి ఆలయంలో సోమవారం పుష్పయాగం చేశారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, పుష్పయాగం చేశారు. కోలాటం, తదితర సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. శ్రీసాయి నాట్య భారతి అకాడమీ ప్రతినిధి శిరీషారాణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నృత్యప్రదర్శనలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పెదసంఖ్యలో భక్తులు ఈ యాగంలో పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే స్టీల్‌ప్లాంట్ టర్న్ అరౌండ్

సీఎండీ అతుల్‌భట్

ఉక్కునగరం: ఉద్యోగుల సమష్టి కృషితో స్టీల్‌ప్లాంట్ టర్న్ అరౌండ్ సాధ్యమని సీఎండీ అతుల్ భట్ ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా సోమవారం ఉక్కు మల్టీపర్పస్ హాల్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ సంక్షోభం నుంచి బయటపడేందుకు ఉద్యోగులు, కార్మిక సంఘాలతో పాటు ఇతర వ్యాపార సహచరులు మద్దతు ఇవ్వాలని కోరారు. టర్న్ అరౌండ్ ప్లాన్ పంచుకుంటూ సాంకేతిక అడ్డంకులు, ఆర్థిక సమస్యలు, వర్కింగ్ క్యాపిటల్ సమస్యలు, రుణ తగ్గింపు వ్యూహాలు, ముడి సరుకుల అనుసంధానాన్ని నిర్ధారించడం వంటి అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన సంస్థ డైరెక్టర్లతో ఇంటర్నల్ సంచిక ఉక్కు వాణి, ఫీల్డ్ బుక్, వార్షిక క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ప్లాంట్ మార్కెటింగ్, ఉత్పత్తి వివరాలు వెల్లడించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు డి.కె. మొహంతి, ఎస్.సి.పాండే, సీఐఎస్ఎఫ్ కమాండెంట్ ఎ.ఎం.హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్

ఆపన్నులకు అండగా వైఎస్సార్‌సీపీ

అగనంపూడి: ఆపదలో ఉన్నవారికి వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ గాజువాక కో–ఆర్డినేటర్ ఉరుకూటి రామచంద్రరావు (చందు) అన్నారు. అగనంపూడి దిబ్బపాలెంకు చెందిన లారీ డ్రైవర్ తలారి శ్రీనివాసరావు గుండెనొప్పితో బాధపడుతూ ఇటీవల శస్త్ర చికిత్స చేయించుకోవడంతో ఆయన్ను పరామర్శించారు. ప్రభుత్వపరంగా సహాయం చేసేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

- పదిరోజుల క్రితం అకాల మరణం పొందిన విద్యార్థి మొల్లి నిఖిల్ కుటుంబాన్ని పరామర్శించి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఇల్లపు ప్రసాద్, నాయకులు యలమంచిలి అప్పారావు, బలిరెడ్డి శ్రీను, బొట్ట గంగరాజు, ఇల్లపు జువ్వాలు, గెద్దాడ సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



లారీడ్రైవర్ శ్రీనివాసరావును పరామర్శిస్తున్న ఉరుకూటి చందు

వార్షిక నివేదిక ఆవిష్కరణ

కూర్మన్నపాలెం: నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా కూర్మన్నపాలెం శిష్టకరణాల అసోసియేషన్ వార్షిక నివేదికను సోమవారం ఆవిష్కరించి సభ్యులకు అందజేశారు. కార్యక్రమానికి హాజరైన హ్యూమన్‌రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మంత్రి శ్యామ్‌ప్రసాద్ కేక్ కట్ చేసి, సభ్యులను నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉర్లం ప్రసాద్, మంత్రి నరసింహమూర్తి, ఎంపీ.జనార్దన్, డి.సత్యారావు, పీఎస్‌వీఎన్ గోపాల్, శివాజీ పట్నాయక్, కె.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



వార్షిక నివేదికను ప్రదర్శిస్తున్న సభ్యులు

రిటైర్డ్ ఉద్యోగికి సత్కారం

పెదగంట్యాడ: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో డబ్ల్యూఆర్‌ఎంలో చార్జిమన్‌గా విధులు నిర్వర్తించి, ఉద్యోగ విరమణ పొందిన వంకతాటి నాగేశ్వరరావు దంపతులను నడుపూరులోని జ్ఞాన మందిరంలో సోమవారం సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నడుపూరు సభ్యులు బొడ్డు కృష్ణారావు, కులుకూరి శ్రీనివాసరావు, కులుకూరి మంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతో ‘ఉక్కు’ పరిరక్షణ

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమంలో ప్రజలను భాగస్వామ్యం చేయడం ద్వారా విజయం సాధించగలమని నాయకులు పేర్కొన్నారు. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలి వద్ద నిర్వహిస్తున్న నిరాహార దీక్షలు సోమవారం నాటికి 1054వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, ఉక్కు నిర్వాసితులు కూర్చున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగంలోనే కొనసాగించేందుకు ఉక్కు కార్మిక వర్గం ప్రజలను చైతన్య పరిచి ఉద్యమం వైపు మళ్లించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.



1054వ రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు